క్లుప్తంగా

ఎంపీడీవోగా సంజీవ రమణయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న సంజీవ రమణయ్య

గార: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సంజీవ రమణయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి ఈవోపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శిమ్మ రామ్మోహనరావు శ్రీకాకుళం రూరల్ ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. సంజీవ రమణయ్య బాధ్యతలు తీసుకున్న అనంతరం మండలంలోని సచివాలయాలు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పనులు, భవన నిర్మాణాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు, శేఖర్ తదితరులున్నారు.

గార ఎస్సై బాధ్యతల స్వీకరణ



కామేశ్వరరావు

గార: గార పోలీసు స్టేషన్ ఎస్సైగా నడుమూరి కామేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాతపట్నం ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు తీసుకున్న తర్వాత మండలంలోని క్రైమ్, ఇటీవల వరుస దొంగతనాలు, శాంతిభద్రతలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ పి.విఠలేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

అన్నపూర్ణ పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ సేవా నిత్య అన్నదాన పథకానికి పీఎన్ కాలనీకి చెందిన విశ్రాంత ఇంజినీరు కూన అప్పలనాయుడు తన మనుమరాలి పుట్టిన రోజు సందర్భంగా రూ.పది వేలు విరాళంగా శనివారం అందించారు. అన్నదాన ఉపాధ్యక్షుడు సూర రామచంద్రరావు, సభ్యులు లోలుగు నూకరాజు, వేణు మాస్టర్ పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మతల్లి ఆలయ ప్రతిష్ట



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామంలో శుక్ర, శనివారాల్లో కొత్తమ్మతల్లి ఆలయ ప్రతిష్ట ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అమ్మవారి రాతి, వెండి పాదుకలను తిరువీధి నిర్వహించారు. కళా హోమాలు, ప్రతిష్ట, బింబి దర్శనం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామికి ప్రీతికరమైన వారం కావడంతో ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు జరిగాయి. అర్చకుడు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి, పూజలు నిర్వహించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది.

కొనసాగుతున్న నిరసన



అర్ధనగ్న ప్రదర్శనలో మత్స్యకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసి మంచినీటిని అందించాలని కోరుతూ డి.మత్స్యలేశం గ్రామస్తులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. డి.మత్స్యలేశం వైశాఖి బయోమెరైన్ హేచరీ ముందు మత్స్యకారుల నిరసన శనివారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

ఊరూరా అభివృద్ధి



కంబాలపేటలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- బంటుపల్లి సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఊరూ అభివృద్ధి చెందుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బంటుపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కంబాలపేట, బంటుపల్లి గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల వివరాల జాబితాను చదివి వినిపించారు. పథకాలన్నీ వచ్చాయా..లేదా అని అడిగి తెలుసుకొని బ్రోచర్లను అందజేశారు. ఇంకా ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని, సొంత స్థలంలో కట్టుకున్న గృహాలకు బిల్లులు మంజూరు చేయాలని పలువురు కోరారు. అర్హులైన అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, బిల్లులు కూడా వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందుతుండడానికి ముఖ్యమంత్రి జగనే కారణమన్నారు. ఈ పథకాలన్నీ మళ్లీ రావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని.. సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెద రామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, కిల్లారి రమణ, గొర్లె తిరుపతినాయుడు, బడి రాంబాబు, గొర్లె అప్పలనర్సునాయుడు, మహంతి చిన రామినాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, కరిమజ్జి భాస్కరరావు, మండల మహిళ అధ్యక్షురాలు గురాన మానస, మాజీ సర్పంచ్ పాశపు ముకుంద, గోపిన నారాయణరావు, వెలిచేటి సుధాకర్, పాశపు వెంకటరావు, ముంగం చిన్నారావు, ఎండ తవుడు, ముంగం శ్రీనివాసరావు, కొంపెల్ల అప్పారావు, పసుపురెడ్డి సత్యనారాయణ, ఈశ్వరరావు, మండపాటి చిన్ని రాక్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి.. పనులు ప్రారంభించి..



హద్దుల మేరకు గట్లు వేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పెద్ద చెరువును రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ మేరేకు చెరువు గర్భంలో రెవెన్యూ రికార్డుల మేరకు హద్దులు నిర్ణయించారు. ఆక్రమణలను తొలగించి హద్దుల్లో మట్టితో గట్టు వేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులో మట్టి పనులకు శ్రీకాకుళం చుట్టారు. చెరువు గర్భం సర్వే నంబరు 128లో 180 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం చెరువు విస్తరణ పనులు ప్రారంభించారు. చెరువులో నారాయణపురం కుడి కాలువ జలాలు చేరుతాయి. 800 ఎకరాలు ఆయకట్టు చెరువు కింద ఉంది. ఖరీఫ్, రబీల్లో సైతం చెరువు కింద పంటలు సాగు చేస్తారు.

మహిళా సాధికారితకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న చిరంజీవి

ఎచ్చెర్ల కాంపస్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారితకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ముద్దాడ గ్రామంలో 'పల్లెపల్లెకు ఎంపీపీ' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు కుటుంబాలను ప్రగతి పథంలో నడిపిస్తారని.. అందుకే వారి పేరునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ఇళ్ల పట్టాలు, ఇళ్లు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ఆసరా, చేయూత వంటి అనేక పథకాలు మహిళలకే అందిస్తున్నామన్నారు. ముద్దాడ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్వయం సహాయ సంఘాలకు రూ. 6.78 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, స్థానిక సర్పంచ్ సర్పంచ్ ముద్దాడ శంకర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బెండు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సకాలంలో విద్యా కానుక పంపిణీ

- డీఈవో తిరుమల చైతన్య



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

రణస్థలం: అప్రమత్తంగా వ్యవహరిస్తూ సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యా కానుక కిట్లను పిల్లలకు పంపిణీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురం హైస్కూల్లోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. విద్యా ప్రమాణాల అభివృద్ధికి ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపే విధంగా క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అందరూ బాధ్యతతో పని చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఉన్నతాధికారులు ఎటువంటి సమాచారం అడిగిన తక్షణమే సమాధానం చెప్పేలా జగనన్న విద్యాకానుక, విద్యార్థుల వివరాలు ఉండాలని చెప్పారు. తొలుత పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎంఈవో ఎ.త్రినాథరావు, హెచ్‌ఎం రాజాకిశోర్, సీఆర్‌పీలు యు.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఎస్.రామకృష్ణ, జి.గౌరీ నాయుడు, జి.రామకృష్ణ, ఎంఐఎస్ పాగిరి విజయకుమార్, అసిస్టెంట్ ఐ.ధనుంజయ్ ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న గీతా శ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్: జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్, జుహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సానావీధిలోని డీటీడీసీ ప్రాంగణంలో ప్రజల దాహార్తి తీర్చడానికి ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ చలా ఓబులేస్ శనివారం ప్రారంభించారు. 500 మందికి దాతల సహకారంతో మజ్జిగను పంపిణీ చేస్తున్నట్టు అధ్యక్షుడు డాక్టర్ వినోద్ కూర్మానా తెలిపారు. సామాజికవేత్త డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్, జేసీఐ ఉపాధ్యక్షులు బగాది ప్రవీణ్, కోశాధికారి సింగూరు ప్రవీణ్, జుహిత్ నందన్ ట్రస్ట్ చైర్మన్ గోపికృష్ణ పాల్గొన్నారు.

నేడు విశ్రాంత న్యాయమూర్తికి సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త గురుగుబెల్లి యతిరాజులను బాపూజీ కళామందిర్‌లో ఆదివారం సాయంత్రం సత్కరించనున్నట్టు నారాయణ తిరుమల, వేంకట రామానుజ సేవాదళం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ద్వారా చిక్కోలు కీర్తి వ్యాప్తి చెందిన సందర్భంగా ఈ సత్కారం చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి హైకోర్టు విశ్రాంత జడ్జి, చైర్మన్ ఆఫ్ తెలంగాణా హ్యూమన్ రైట్స్ కమిషన్ డాక్టర్ జస్టిస్ జి.చంద్రయ్య పలువురు జిల్లా నాయకులు హాజరవుతారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



సర్పంచ్ అప్పన్నను పరామర్శిస్తున్న నాయకులు

లావేరు: పోతయ్యవలస పంచాయతీ సర్పంచ్ కొంపెల్ల అప్పన్న తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలియడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మాజీ సర్పంచ్ చిలకలపల్లి పరంధామయ్య, నాయకులు మహంతి సత్యనారాయణ తదితరులు పోతయ్యవలస గ్రామానికి వెళ్లి సర్పంచ్ అప్పన్నను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

సచివాలయ ఉద్యోగికి..

రణస్థలం: మరువాడ గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళ పోలీస్)గా పనిచేస్తున్న జయశ్రీ భర్త సోమేశ్వరరావు ఇటీవల మరణించారు. దీంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శ్రీకాకుళంలోని ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు తదితరులు ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో గోపాలకృష్ణ



గోపాలకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు ఫణీంద్రశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర భూ రికార్డులు సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ విభాగ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. జిల్లాకు చెందిన రోణంకి సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించి గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. ఈయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ, ఆలయ సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్, కేశవరావుపేట సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఒక్కో వలంటీర్ పోస్టులను అధికారులు భర్తీ చేశారు. ఇంటర్వ్యూ అనంతరం ఎంపికైన వారికి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి నియామక పత్రాలను అందజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కణితి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎం.ఉదయశ్రీ, ఎల్.సౌమ్య ఉన్నారు. విద్యార్థినుల ఎంపికపై హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, ఉపాధ్యాయులు వ్యక్తం చేశారు.

కోటేశ్వరాలయంలో లలితా హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి విశేష అభిషేకాలు, లలితా హోమం నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉదయం గర్భగుడిలో మూలమూర్తికి మూడు గంటల పాటు అభిషేకాలు జరిపారు. సాయంత్రం లలితాదేవి హోమం జరిగింది.

మహిళా హోంగార్డుల మానవత్వం



దివ్యాంగురాలిని ఎత్తుకుని తీసుకువెళ్తున్న మహిళా హోంగార్డులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో శనివారం నుంచి ప్రారంభమైన గ్రూప్ -1 పరీక్ష రాయడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలికి సేవలందించి మహిళా హోంగార్డులు మానవత్వం చాటుకున్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్ష రాయడానికి వచ్చిన దివ్యాంగురాలిని మెయిన్ గేట్ నుంచి పరీక్ష హాల్ వరకు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డులు సునీత, రాజులు ఎత్తికొని తీసుకొని వెళ్లి సేవలందించారు. కాగా పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సందర్శించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీకాకుళం అర్బన్ పుస్తకాలకు బూజు దులుపుతున్న శేషగిరిరావు తదితరులు

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలను నిరుద్యోగులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అన్నారు. మనం-మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. అందులో భాగంగా కేంద్ర గ్రంథాలయంలోని పుస్తకాలకు పట్టిన బూజును దులిపి శుభ్రం చేశారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకుడు సువ్వారి సత్యనారాయణ, గ్రంథాలయ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ధర్మవరంలో శనివారం హిందీ భాష ప్రాధాన్యతపై.. ఎచ్చెర్లలో మన్యం వీరుడు అల్లూరి సీతారాంరాజు జీవిత చరిత్రపై పిల్లలకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్లు చంద్రశేఖర్, నీలమ్మ పాల్గొన్నారు.

రణస్థలం: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పుస్తకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం శాఖాగ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులచే దినపత్రికలు, కథలు చదివించడం, రాయించడం చేయించారు. ఉపాధ్యాయులు బి.కుమార్, జి.రాజ్యలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: ఇచ్ఛాపురానికి చెందిన స్వేచ్ఛా నృత్య తరంగిణి సంస్థ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. స్థానిక బాపూజీ కళామందిరంలో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 284వ నెల కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నృత్య దర్శకురాలు మంగి దివ్య శిష్య బృందంచే ప్రదర్శించిన పలు నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలో చిన్నారులు కె.కుమార్, బి.భవానీ, ఎంబివి మధురిమ, ఉషారాణి, భార్గవి, సంగీత, వర్మిత, కె.గోవిందరావు, మంగి దాలమ్మలు చక్కనైన ప్రదర్శన ఇచ్చారు. అనంతరం సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారతి ఐటీఐ కరస్పాండెంట్ చిట్టి వెంకటరావు మాట్లాడుతూ.. మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. అనంతరం పేద కళాకారులకు నెలవారీ పింఛన్లను అతిథుల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో రాజాం పోలిపల్లి పైడితల్లి కళాపరిషత్ అధ్యక్షుడు బలివాడ శ్రీనివాసరావు, అభినయ నృత్యనికేతన్ దర్శకురాలు టి.నీరజాసుబ్రహ్మణ్యం, నిక్కు హరిసత్యన్నారాయణ, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, డాక్టర్ సంపత్‌కుమార్, సుగుణాకర్, నిక్కు అప్పన్న, అప్పాజీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ముగిసిన ఆలయ ప్రతిష్ట



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: పెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రైలు ప్రమాదంపై కాంగ్రెస్ దిగ్భ్రాంతి

శ్రీకాకుళం అర్బన్: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేశ్, పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు కేంద్రం ప్రకటించిన రూ.10 లక్షలు పరిహారంతో పాటు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మానవతా దృక్పథంతో స్పందించి తగినంత ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగులకు మినిమం పెన్షన్ రూ.7, 500 ఇవ్వాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ కోరారు. శ్రీకాకుళంలోని ఈయూ కార్యాలయంలో శనివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు మెడికల్ సదుపాయం కల్పించాలని, ఈఎస్ఐ, కోర్టుతీర్పును అనుసరించి హయ్యర్ పెన్షన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొర్లాం గణేశ్వరరావు, జె.ఎస్.రాజు, నాగరాజు, సత్యం ఉన్నారు.

సంతవురిటిలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ బుడారి లక్ష్మణరావు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారి యశ్వంత్, ఉప సర్పంచ్ చందనాల గణపతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కుప్పిలి ఉమామహేశ్వరి, వరలక్ష్మి, పూర్ణిమ, ఏఎన్ఎం కుప్పిలి లక్ష్మి పాల్గొన్నారు.

లైబ్రేరియన్ ఉద్యోగాలు భర్తీ చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ ఉద్యోగాలను శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ సంస్థ నిరుద్యోగ జేఏసీ, ఉత్తరాంధ్ర నాయకుడు జామి శ్రీకాంత్ బాబు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు రౌతు వేణు, సెక్రటరీ కమల్ కుమార్, తులసీరావు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో శనివారం జరిగిన మనం-మన గ్రంథాలయం కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మండపాటి శేషగిరిరావును, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణను కలిసి విజ్ఞప్తి చేశారు.

మలేరియా నియంత్రణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మలేరియా వ్యాధి నియంత్రణే లక్ష్యమని హెల్త్ క్లినిక్ అసిస్టెంట్ చిట్టిబాబు అన్నారు. జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు మలేరియా నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా చిన కొంగరాంలో మలేరియా నియంత్రణ, నివారణ పద్ధతులపై శనివారం అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సబ్‌స్టేషన్ ముట్టడి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు సబ్‌స్టేషన్‌ను వాకలవలస గ్రామస్తులు శనివారం రాత్రి ముట్టడించారు. సబ్‌స్టేషన్‌ను ఆనుకొని ఉన్న వాకలవలస, చుట్టపక్కలా గ్రామాలకు రెండు రోజులుగా విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. దీంతో ఆగ్రహానికి గురైన కొంతమంది సబ్‌స్టేషన్‌ను చుట్టుముట్టారు. అయితే ఆ సమయంలో ఏఈ లేకపోవడంతో వ్యతిరేక నినాదాలు చేశారు.

